
# వరదగూడు మెరుపుతీగ



సాయంత్రమైంది. రెండురోజుల నుండి ఎడతెరపిలేకుండా, జోరున కురుస్తున్న జడివాన కొంచెం వెనకాడినట్లు కనపడి చిన్న చిన్న తుంపరులు పడుతున్నాయ్. వొళ్ళు కొరికేస్తున్న చలిగాలి; మేఘావృతమైన ఆకాశం; ప్రొద్దున్నే చీకట్లు కమ్ముకొస్తున్నట్లుంది. ఊరికి దూరంగావున్న వీరన్న కుంటపై కూర్చొన్నాడు పాలేరు వెంకన్న నెత్తినిండా గుడ్డకప్పుకొని – చుట్టూ పచ్చని పైరుపొలాలు. కుంటమీద కూర్చొన్న వెంకన్న అనాలోచితంగానే వ్రేళ్ళ మధ్య తడిమట్టిని ముద్దగాచేస్తూ తనకు తెలియకుండానే ఆమట్టిముద్దను కుంటలోకి విసరివేస్తూ వుండిపోయాడు.

'ఎవరక్కడ?' జగ్గయ్యమామ దూరం నుండి పరిశీలించినా గుర్తించలేక దగ్గరగా వస్తూ అడిగాడు.

వెంకన్న త్రుళ్ళిపడి, 'నేను మామా' అన్నాడు లేచి ఒళ్ళు విరుచుకొంటూ.

ఎవరు? వెంకన్నా, నీవంటరా...యెవరో అనుకొన్నా...ఆ అయితే యీ వానలో యీడ కూర్చున్నావేం? అసలే యీదర గాలి..." అంటూ సగం కాల్చిన చుట్టపీకను నోట్లో పెట్టుకొని వెలిగించాడు జగ్గయ్యమామ. వెంకన్న మాట్లాడలేదు.

"ఆఁఆరే, అయితే మునసబు గారి కాడ పని మానేసినట్టేనా......అంతేగా మరి నువ్వా కొద్దాడివి, వాళ్ళా యెందుకైనా చాలినోళ్ళు...ప్చ్ ... అయినా" అంటూ ఏదో మాట్లాడబోయి తుపుక్కున వుమ్మేసి దూరంగా మెరసిన మెరపు తీగకు కళ్ళు మూసికొని 'వత్తారా' మళ్ళీ వాన వొచ్చేట్టుంది. అంటూ సాగిపోయాడు.

వెంకన్న జగ్గయ్యమామ వెళ్ళిన వెపు అలా అచేతనంగా చూస్తూ వుండిపోయాడు కొద్దిసేపు. అంతలోనే పెద్ద మెరపుతీగ దేదీప్యమానంగా వెలిగిపోయిందోమారు. వెంటనే పెళాఫెళామంది.

వెంకన్న ఆకాశంవైపు దృష్టి సారించాడోమారు. పెద్దవరద గూడు కన్పించింది.

వరదగూడు.....మెరపుతీగ.

ఈ రెంటిని చూచాక యిక యీనాటికి ప్రయాణం వట్టిదే ననుకొన్నాడు వెంకన్న. పోవీ బయలుదేరితే బయలు దేరవచ్చు. పైన వొచ్చే వానేం చేస్తుంది కనక? కాని వాగు లేరు సురుగులు కక్కితే ఎటూకాకుండా యేటొడున చలిగాలికి కడుపులో కాళ్ళెట్టుకు కూర్చోవాలిసిందే. రెండురోజులనుండి కురిసే వానకు వాగు లేరు రాకుండ వుంటుందా? యెటూ తేల్చుకోలేక మధనపడుతూ కొద్ది సేపలా కూర్చుండిపోయాడు వెంకన్న. నాలుగు ప్రక్కలనుండి చీకట్లు కమ్ముకొచ్చాయి. క్రమంగా మాసిపోయి మాయమైంది వరద గూడు, చిలికి చిలికి చినుకులు పడుతూనే వున్నాయి. ఇక యీ నాటికి ప్రయాణం వట్టిదే!

కాని పాలెంనుండి వెళ్ళకుండా యెలా వుండటం? తెల్లారేపాటికి లచ్చికి పెళ్ళి అయిపోతే, మెళ్ళో తాళితో పసుపుగుడ్డలతో కనపడే లచ్చిని యేముఖం పెట్టుకొని చూడటం?

* * *

వెంకన్న యెక్కడ పుట్టాడో తలిదండ్రులెవరో, ఏమో, యెవరికీ తెలియదు. తన పదిహేనోయేట పాలెంలో మునసబుగారింటిలో జీతగాడిగా ప్రారంభించాడు తన జీవితాన్ని. వేలువిడిచిన మేనమామవంటూ యెవరో వెంకన్నను మునసబుగారి కప్పగించి వెళ్లారు. ఆనాటినుండి వెంకన్న మునసబు గారి దగ్గరే వుండిపోయాడు.

వెంకన్న నమ్రత, వినయం, పని వోద్దిక చూస్తే, ప్రతివారికి అతనంటే, ఓ విధంగా అభిమానం యేర్పడజొచ్చింది పొలం పనుల్లో బగువులెత్తటంలో, గొడ్లకు తాళ్ళు వెయ్యటం సిగమారలల్లటంలో వెంకన్నకు వెంకన్నే సాటి......

కాలం దొర్లిపోయింది. పదిసంవత్సరాలు పరిభ్రమించాయి కాలచక్రంలో...

వెంకన్న మిసమిసలాడే యౌవనుడయ్యాడు. కళకళలాడే మొహం; విశాలమైన ఛాతి; మెలికలు తిరిగిన కండలు. అంత పొట్టి పొడుగుకాని నిండైన విగ్రహం...

మునసబుగారింట్లో పనిచేసే లచ్చి యిప్పుడతనికి మెరపుతీగలా కన్పిస్తోంది. లచ్చి కనిపించినపుడల్లా తనకు తెలియకుండానే చేయితలమీదకు పోయి, వ్రేళ్ళతో పాపిటి దిసేది. ఒక్కొక్కసారి వెంకన్న తనచేష్టలకు తనే నవ్వుకొనేవాడు – లచ్చి రోజూ పడమట పొలానికి తనకు పైటిబువ్వ తెస్తూ వుంటుంది. ఎకసక్కెలాడుతుంది. కొన్నాళ్ళు బెరుగ్గా వుండేది వెంకన్నకు. తరువాత తరువాత లచ్చి తనను ప్రేమిస్తోందేమో? అనిపించి కొంచెం ధైర్యం చేకూరింది.

అయినా యీ ముసుగులో గుద్దులాటెందుకు? అనిపించేది వెంకన్నకు. తేల్చేసుకొందా మనుకొనేవాడు...కాని ధైర్యం చాలేదికాదు. అప్పటికి ఓనాడు మొండి ధైర్యంతో.

'ఏమేలచ్చి నువ్వింకా మనుముచేసికోలేదేమే' అంటూ అడిగేశాడు.

'నామనుము సంగతి నీ కెందుకేంటి మామా' అంది లచ్చి. వెంకన్న బెదరిపోయాడు. లచ్చి యింటికిపోతూ మరి 'నీ మనుము సంగతేంటి మామ' అంది తల క్రిందికిదించి. ఆగినగుండె మళ్ళీ ఆడినంత పనైంది వెంకన్నకు.

'అదే లచ్చీ.....? మాట పెగల్లేదు వెంకన్నకు.

'కొకపోయినా మనం అనుకొన్నయ్యేఅను కొన్నట్లు చేసుకోవటం మనచేతుల్లో వుందా మామా?', లచ్చి సాగిపోయింది.

ఎంతసేపాలోచించినా లచ్చి మాటల్లోని అంతర్యం అర్థంకాలేదు వెంకన్నకు... కాని లచ్చిని తనదానిగా చేసుకోవాలనే అభిలాష ద్విగుణీకృతమైంది.

అక్కడక్కడ, తిత్తిమా పాలేర్లతో తన వుద్దేశ్యాన్ని బయటపెట్టి చూచాడు... ఈ వార్త ఆనోట ఆనోట వూరల్లా పాకిపోయింది.

అందరూ యీడుజోడూ అనుకొన్నారు. అందరికీ ఆమోదంగానే వుందీ వార్త. కాని... సలసలా కాగిపోయాడు లచ్చి మేనమామ రంగడు. తనని కాదని లచ్చి వెంకణ్ని చేసికోవటానికి యెన్ని గుండెలో తేలుస్తానంటూ హుంకరించాడు.

ఏమేవ్, ఆ యెంకణ్ణి చేసుకొంటా నంటున్నదంటగా, అదెట్టా కుదురుతుంది?' అంటూ మొరాయించాడు రంగడు అప్ప రామి దగ్గర. రామి మాట్లాడలేదు. అంతలో లచ్చి రావటం 'నాయిష్ట మెచ్చినాణ్ణి నేచేసుకొంటా నీకేం, నీవేమన్నా నా బాగోగులు చూసేవాడివి గనకనా' అనటంతో మరీ రెచ్చిపోయాడు—అసలే తప్ప తాగి వున్నాడేమో నోటె కొచ్చినట్లు నానా మాటలు మాట్లాడి యిల్లంతా చిందర వందర చేసి కుండలన్నీ పగలగొట్టి 'నన్ను కాదంటే ఖూనీ చేస్తా'నని బెదిరించి మరీ వెళ్ళాడు.

అప్ప రామి హడలిపోయింది. తనూ పెద్దదైంది. బ్రతికినన్నాళ్ళు యింకా బ్రతకబోదు. ఏదో తన ఘటం ఉండగానే, లచ్చిని ఓ అయ్యకిచ్చి, తను కళ్లు మూద్దామనుకొంటే, ఆ ఆశ నెరవేరేట్లు కన్పించలేదు-పోనీ రంగడికే యిద్దామా అంటే— తన సంపాదన లేకపోగా అది సంపాదించిన నాలు రూకలు తాగుడికి తగలేసి తందనాలాడతాడు. వెనక మూకనంతా పోగుచేసి పిచ్చివేషాలేస్తాడు. అయినా అసలు లచ్చికి వాడంటే సుతరామూ యిష్టం లేదు. రోజులు గడుస్తున్న కొద్దీ రంగడిగోల యెక్కువైంది...ప్రతినిత్యం యింట్లో గోల; అప్పటికీ రామి తగాదాకు దిగకుండా సర్దుకుపోతున్నా...ఊళ్లో అక్కడక్కడ తనే లచ్చిని పెళ్ళిచేసికోబోతున్నా'ననీ; 'ఈ నిర్ణయాన్ని యెవరూ యెదిరించలేర'ని అంటూ ప్రచారం కొనసాగించాడు రంగడు.

* * *

కథలో సరికొత్త పాత్రలు వచ్చిపడ్డాయి. మునసబుగారిముందర పంచాయితీ కొచ్చింది లచ్చి—రంగడి తగాదా. పదిమంది ముందరా రంగణ్ణి తను పెళ్ళాడనని కచ్చితంగా చెప్పింది లచ్చి.

'దానిష్టం బాబు—నా దేముంది' అంది రామి.

'నన్ను మనువు చేసికోవటమో, లేక పోతే నాకు రావాలసిన అయిదు వందల రూపాయలు యిప్పుడు కట్టటమో తేల్చమన్నాడు రంగడు...

రామి—లచ్చి తెల్లబోయారు. అయిదు వందల రూపాయలు తానెందుకివ్వాలో అర్థంకాలేదు వారికి. పైగా వాడి జాదా లఘు, తాగుళ్ళకు పీళ్ళ సామ్మే చాలా హరించిపోయింది—

'అయిదొందల రూపాయలేంటే' అంటూ అమాయకంగా ప్రశ్నించింది రామి.

'అదే నిరుడు మాసూల్లో నాదగ్గరఅప్పుగా పుచ్చుకొన్న బాపతు' అన్నాడు రంగడు.

మాసులేంటి 600 రూపాయలు మేమెందుకు తీసుకొన్నాం బాబు—అంతా వట్టిదే" అంది రామి. అంతే 'అందుకొన్నారు మునసబు గారు. వట్టిదేనని బుకాయిస్తే సరిపోతుందిటే రామీ? ఇది వ్యవహారం, అతను రాలా అయిదువందలు తీసికొన్నట్లు నీవు వ్రాయించి, వేలిముద్ర వేసిననోటు యిదిగో కాదంటే సరిపోయిందా. అవతలకొట్టుంది మరి! "అంటూ పెద్దమనిషి తరహాలో మాట్లాడి..." మరి వాడి పైకం వాడికి సర్దుతావో...లచ్చినే యిస్తావో" అంటూ తీర్పు ధోరణిలో సమస్యను ఓ దరికి లాక్కొచ్చారు.

రామి 'ఆనోటేమిటో భగవాన్సాక్షిగా నాకు తెలియదు బాబూ' అంటూ లబో దిబోమంది. అది మునసబు గారి పంచాయితీ. భగవంతుడు ఆ చాయలకుకూడ రాడన్న సంగతి గుర్తించలేకపోయింది రామి.

రామిగోల అరణ్యరోదనైంది-పంచాయతీదారులు తీర్పు యిచ్చారు మునసబు గారి మాటలనే; రంగడు గడువులేదని హెచ్చరించాడు;

* * * *

రంగడు, రామిచేత వూరిబయట యిల్లు వేసుకొన్నందుకు కట్టవలసిన శిస్తు తీసివేయించేందుకు తెల్లకాగితంపై అయిదారు సెలల్ క్రితం వేలిముద్రలు వేయించుకొన్నాడు. ఆ కాగితాన్నిలా మునసబుగారిసహాయంతో వినియోగించుకొన్నాడు.



# వరదగూడు మెరుపుతీగ

మునసబుగారిలా వర్తించటానికి కారణం, కేవలం స్వార్థమే; వెనకటి ఏదో కేసులో రంగడు కేసంతా తనపై వేసికొని తన్ను రక్షించటం! అడపా తడపా, యిప్పటికి తనకు ఆ సహాయం, ఈ సహాయం చేసి పెట్టడానికి ప్రతి సహాయమే యిది.

పంచాయితీతతంగమంతా దూరంగావుండి విన్న పాలేరు వెంకన్న పండ్లు పటపటలాడించాడు. పదిమంది సమక్షంలో సాగిపోతూన్న అన్యాయాన్ని ప్రతిఘటించాలనుకొన్నాడు... కాని సాటిపాలేరు జగయ్యరూపు తమాయించమని ఆపటంతో వెనకాడాడు.

ఆమర్నాడు లచ్చి కన్పించింది వెంకన్నకు ...ఏదో మాట్లాడదామనుకొన్నాడు కాని లచ్చి వెంకన్నను చూస్తూనే తలవొంచేసుకొని దూరంగా వెళ్ళిపోయింది!

వెంకన్నకు తనముందు రెండే రెండు సమస్యలు మిగిలిపోయాయి. లచ్చి తనను వివాహమాడటానికి యిష్టపడుతుందా? అలా అయితే లచ్చిని రంగడి బారినుండి తప్పించే మార్గమేది? ఈ ప్రశ్నలకు సమాధానం చాలసేపు తోచలేదు. చివరకు ఓ నిర్ణయానికొచ్చాడు! లచ్చి తన్ను పెళ్లాడినా లేకున్నా, లచ్చికి అయిదువందల రూపాయిలు తనందించాలి. తనకూ జీతం బాపతు గత అయిదు సంవత్సరాలుగా వెయ్యి రూపాయిలు రావాలి. తనా పైకం మునసబుగారి దగ్గరే దాచుకొన్నాడు కూడ.

'పైకం కొంచెం దయచేయించండి అవసరంగా వుంది' అంటూ సాయంత్రం మడక చూడటానికొచ్చిన మునసబుగారిని అడిగాడు వెంకన్న....

నీకిప్పుడు పైకం యెందుకోయ్' అన్నాడు మునసబుగారు.

'కావాలండి' నీళ్ళు నమిలినట్లు సమాధానమిచ్చాడు వెంకన్న తలగోక్కుంటూ.

ఈ వరస వస్తుంది అని మునసబుగారికి ముందే తెలుసు. సమాధానాన్ని అందుబాటులోనే వుంచుకొన్నాడు. "పట్టుపట్టుమంటే పైకం అంగుతుందా? కొంచెం వెసులుబాటు చూచుకొని అలా చేయిస్తా...అయినా వెంకడూ, నీ కొన్ని విషయాలలో జోక్యం గల్గించుకొకు అందని పళ్లకు అర్రులు చాచి ప్రయోజనం లేదు' అంటూ హెచ్చరించి మరీ వెళ్ళాడు.

వెంకన్నకిదేం బోధపడకపోయినా మునసబుగారు తనకు ఎలాంటి సహాయం చేయరని మాత్రం గ్రహించగల్గాడు. అతనిలో వుద్రేకం కట్టలు తెంచుకొంది—కాని తాను పాలేరునని జ్ఞప్తికి తెచ్చుకొని తమాయించుకొన్నాడు...

ఇంటికేసి వెళ్లటానికి బయలుదేరిన వెంకన్నకు దారిలో లచ్చి కన్పించింది— తనెందుకో లచ్చిని పలుకరించటానికి సంకోచించాడు...కాని లచ్చే పల్కరించింది.

"ఎక్కడనుండి మామా" అంటూ.

'మడకనుండి లచ్చీ' వెళుతూన్న వాడల్లా ఆగి జవాబు చెప్పాడు వెంకన్న.

"ఇయ్యాలదాక..." మధ్యలో ఆపివేసింది లచ్చి—

'అవును లచ్చీ ఏదో పనుండి వుండిపోవాల్సి వచ్చింది...అది సరేగాని మీ రంగడేమంటున్నాడు?' వుండబట్టలేక అడిగేశాడు; లచ్చి సొంత విషయాలలో చొరవగా తలదూర్చట మిదే ప్రథమం వెంకన్నకు—

ఏమంటాడు......దిక్కులేని వాళ్ళను ఎవరెట్లా అనాలో, ఎవరెట్లా చూడాలో... అట్లా అందరూ చూస్తున్నారుగా...అంటున్న లచ్చి కళ్లలోకి నీళ్ళుగిర్రున తిరిగాయి కంఠం గద్గదికమైంది. వెంకన్నకు కొరడాతో చరిచినట్లు వినిపించాయా మాటలు. లచ్చి మాటల్లో తనని వుద్దేశించిన మాటలున్నాయా అనిపించింది. ఏనాడూ కంటతడి యెరుగని లచ్చి యీనాడిలా దిగాలు పడిపోవటంతో వెంకన్నకు లచ్చి స్థితి యెంత హీనంగా వుందో అర్థమైంది.

'అవును లచ్చీ నేనన్నా పైకం సర్ది అవసరానికి అడ్డు పడదామంటే......వీలులేకపోయింది' నిస్సారంగా జవాబిచ్చాడు


మిక్కిలి ఆదాయకరం!




కుటుంబం మొత్తానికీ ఒకే ఒక టాల్కం పౌడర్

ఉత్సాహాన్ని రేకెత్తించే సువాసన గల ప్రోటెక్స్ నాణ్యమైన, సర్వ విధోపయోగమైన టాయిలెట్ పౌడర్ పెద్ద డబ్బాలో తక్కువ ధరకు లభ్యమౌతున్నది!

ఇండియా అంతటా వేలాది కుటుంబాలు సున్నితమైన సువాసనకు ప్రోటెక్స్‌నే ఎన్నుకుంటారు. అది అన్నివిధాలా ఉపయోగించడానికి వీలైనది కావడమే కారణము...

ఇప్పుడు సుందరమైన పఫ్‌తో సహా దొరకును!




ప్రోటెక్స్
సర్వోపయోగమైన
టాయిలెట్ పౌడర్

మరియొక కాల్గేట్ నాణ్యమైన తయారు

వెంకన్న……

తలవొంచేసుకొనివున్న లచ్చినిట్టూర్చింది. 'ఏటి కొగురించలేం లేమామా! అయినా నా బతుకోసం నీవు యిరుకున పడటం దేనికి నా బతుకే వరదగూడు' పొగిపోయింది భారంగా లచ్చి.

భారంగానే యిల్లుజేరిన వెంకన్నకు రంగడు మునసబుగారి ఆధ్వర్యాన్న యిల్లుంటే పెళ్ళిచేసికో బోతున్నాడని తెలిసింది. ఆరాత్రల్లా వెంకన్నకు నిద్రపట్ట లేదు-'నాబతుకే వరదగూడు' ఆ నెమాటలే కలవరపెట్టాయి వెంకన్నను.

తెల్లవారే సరికి యీ దరగాలితో ప్రారంభమైంది చిలికిచిలికి పడే వానజల్లు. లచ్చి పెళ్ళాయ్యాక యిక తనావూరులో బతుకు పొగించటం గుర్భరం! తన కళ్ళ ముందు లచ్చికి అన్యాయంగా పెళ్ళి జరిగి పోవటం సహింపరాని విషయం! కాని జరిగి పోవాల్సింది జరిగి తీరుతుంది. అందుకే తనా వూరినుండి శాశ్వతంగా నిష్క్రమించాలి. 'రేపు లచ్చిపెళ్ళి-ఈరోజే వెళ్ళిపోవాలి' వెంకన్న నిర్ణయించాడు. పది సంవత్సరాలు తల్లిలా ఆదరించిన గ్రామాన్ని వదలిపోవట మంటే బాధవేసింది. కాని … తప్పదు. అంతర్యంలో నమస్కరించాడో సారి- 'దూరంగా వెళ్ళిపోతున్నానమ్మ' అను కొంటు.

తిన్నగా వీరన్నకుంట జేరాడు. వెంకన్న ఎక్కడికో? తన గమ్యమేదో? అంతా అగమ్యంగా వుంది.

వెంకన్న ఆలోచనా తరంగాలనుంచి తేలి బయటపడేసరికి వానజల్లు వెలిసింది… కాని బాగా చీకటిపడిపోయింది; తెల్లవారక ముందే దాటిపోవాలి తను-ఈ రాత్రికి కుంటమీద గడిపి తెల్లవారుజామున వెళ్ళ టానికే నిశ్చయించుకొన్నాడు వెంకన్న- తుమ్మచెట్టుమీద గ్రుడ్లగూబ పిచ్చిక గూటిపై వాలినట్లుంది పిచ్చిక కిచకిచ లాడింది.

పిచ్చుక గూడు-అదే వరద గూడు- లచ్చి జ్ఞాపకాని కొచ్చింది.

వెంకన్నకు జాలి కేసింది-ముడుచుకొన్న శరీరాన్ని సైతం కష్టపెట్టి, లేచి గ్రుడ్ల గూబను తోలివేశాడు.

దూరంగా చప్పుడయింది. ఎవరో వస్తు న్నట్లు. వస్తున్న దెవరో పోల్చుకో లేక పోయాడు చీకటిలో. తెల్లగా వెలిగిపోయింది మెరపుతీగ………ఆ కాంతిలో మరో మెరపుతీగ…లచ్చి- ఆయాసపడుతూ పరు గున వస్తోంది.

'లచ్చి!'

"మామా!"

"ఎందుకొచ్చావు?"

"ఎందుకేంటె మామా" తమాయించుకొని చెప్పింది లచ్చి. 'యెదవలోకం యిక్కడ నుండి దూరంగా పోయిగా బ్రతికేచోటికి పారిపోదాం పదమామా! మన్ని లోకువగా చూచే యీ పాడూరుతో మనకేంపని… వెళదాం పదమామా!"

వెంకన్న నివ్వెర పడిపోయాడు. క్షణ కాలం నోట మాటరాలేదు.

తనకోసం లచ్చి-లచ్చికోసం తను ఈ పాడూరు వదలి దూరంగా పోవాలి.

'అంతేలచ్చీ!', పట్టరాని ఆనందంలో లచ్చిని దగ్గరకు తీసుకున్నాడు. మెరపుతీగ మెరిసిపోయింది, మరోమారు 'కానీ లచ్చీ! తెల్లారిపోదాం. అసలే సాయంత్రం వరద గూడేసింది. వానొచ్చుద్దేమో! నాగులేరు నురుగులు కక్కుతోంది అసలే!'

'అట్టా యీలు లేదు మామ. యిప్పుడెల్లి పోవాల్సిందే…యెదవ తెల్లారితే పెండ్లని రంగడు తప్పతాగి తందనా లాడుతుంటే తప్పించుకొచ్చా! పసిగడితే వచ్చిపడతాడు పద మామా!'

'మరి వరదగూడేసిందాయె… మెరుపు ల్లి మెరుస్తున్నాయె - యెట్టా లచ్చి!'

'ఒస్! నీకు తెలియదన్న మాట… తూరుపున వరదగూడేస్తే తుంగపోదన్నా తడవదు మామా! వానరాదులే! బయలుదేరు ఇక మెరపుతీగ చుట్టితె నురుగులు కక్కే నాగులయ్య సైతం నూగారి పూరటపొందాలి సిందే!…అంతే నీకు తెలవదు. అట్టా మా తాత చెప్పేవాడు నాకు …… మాట్లాడక బయలుదేరు.

"అంతేలే లచ్చి, నీవు నాపక్కనుంటే నాగులయ్యరాడు - వానదేముడురాడు. అయినా నేనీడున్నానని ఎవురు చెప్పారు?' 'జగయ్య మామా' అంటూ దారితీసింది లచ్చి. సౌదామిని నొకటి మెరిసింది విద్యుల్లతొకటి విరిసింది మెరపుతీగొకటి వెలిగింది - లచ్చి వెంకన్నకు దివ్వెల్లా. ★


మీ ఇంటిని సంగతముతో కలకలలాడేలా చేయుటకు

తక్కువ ధరలో ఒక సొగసైన నేషనల్-ఎక్కో రేడియో





అందమైన నేషనల్-ఎక్కో రేడియో మోడలు-717 పెట్టుకొంటే మీ యిల్లు సంగీతముతో కలకలలాడుతూ ఉంటుంది! ఈ మోడలు, ఏసి/డిసి కరెంటుమీద పనిచేసేదిగా మరియు డ్రై బ్యాటరీమీద పనిచేసేదిగా, రెండు రకములలో దొరకుతోంది.

తక్కువ ధరలో దొరకే యీ మోడలు,రేడియో ప్రసారములను దివ్యముగా వినిపించును మరియు ఎల్లతరబడి చక్కగా పనిచేయును. దీనితో ఒక సంవత్సరము గ్యారంటీ యివ్వబడుతుంది. త్వరలోనే మీ దగ్గరలోనున్న ఏ నేషనల్-ఎక్కో వ్యాపారివద్దనైనా దీనిని పెట్టమని వినండి!

మోడలు 717 : బంగారు రంగు తాపడముతో మరూన్ రంగు ప్లాస్టిక్ క్యాబినెట్. మోడలు యు-717: 5 వాల్వుల, 3 బ్యాండుల ఏసి/డిసి సెట్. మోడలు బి-717: 4 వాల్వుల, 3 బ్యాండుల డ్రై బ్యాటరీ సెట్.

రు. 250/- స్థానిక పన్నులు అదనము

నేషనల్-ఎక్కో రేడియోలు శ్రేష్ఠమైనవి… అవి 'మాన్‌సూనైజ్' చేయబడినవి

జెనరల్ రేడియో & అప్లయన్సెస్ ప్రైవేట్ లి.
ఒపేరా హౌస్, బొంబాయి 4 • 3 మదన్ స్ట్రీట్, కంకత్తా 13
1/18 మౌంట్ రోడ్, మద్రాసు • 35/79 ఎల్వర్ జూబ్లీ పార్క్ రోడ్, బెంగుళూరు • జోగ్గియాన్ బిలిల్డి, చాందినీ చౌక్, ఢిల్లీ

GRA 6087